

అలంగనల్లూరు జల్లికట్టును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి





ఎద్దును అణచివేస్తున్న యువకుడు

ఓ యువకుడిని నేలపై తొక్కి పరుగెత్తుతున్న ఎద్దు

అలంగానల్లూరు జల్లికట్టులో రంకేసిన పోట్లగిత్తలు

కదనరంగంగా మారిన వాడివాసల్

- పట్టువదలని యువకులు
- 20 ఎద్దులను అణిచి విజేతగా నిలిచిన అభిసిద్ధర్

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్టు అలంగానల్లూరు జల్లికట్టులో పాల్గొంటేనే ఎద్దులకు, యువకులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందనటం అతిశయోక్తికాదు. అవనియాపురం జల్లికట్టుకు ఉన్న క్రేజ్ అయితే మాటలలో వర్ణించలేం. ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు మూడువేలకు పైగా ఎద్దులు పేర్లను నమోదు చేశారు.. వాటిని అణచివేసేందుకు సుమారు రెండు వేలమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టుకున్నారు. ఇందులో 1000 ఎద్దులు, 900 మంది యువకులను ఆ కమిటీ ఎంపిక చేసింది. గురువారం ఉదయం 7.40 గంటలకు ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. అలంగనల్లూరు కాళియమ్మన్ ఆలయం ఎదురుగా ఉన్న వాడివాసల్ మైదానంలో జిల్లా కలెక్టర్ సంగీత, రెవెన్యూ అధికారి శక్తివేల్ ఎద్దుల యజమానులు, యువకులకు, క్రీడా కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వాడివాసల్ వీఐపీ గ్యాలరీ నుంచి జెండా ఊపి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ వెంకటేశన్, శాసనసభ్యులు భూమినాథన్, దళపతి, తమిళరసి, ఉదయనిధి కుమారుడు ఇన్బనిధి తదితరులు పాల్గొన్నారు. ముందుగా మునియాండి సామి ఆలయ ఎద్దు, అరువిమలై చెంగయమ్మన్ ఆలయ ఎద్దు, కరుప్పసామి కోవిల్ ఎద్దు సహా స్థానిక ఆలయాలకు చెందిన ఎద్దులను వాడివాసల్ నుండి వరుసగా విడిచిపెట్టారు. వాటిని ఎవరూ పట్టుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత వాడివాసల్ నుంచి ఎద్దులు రంకెలు వేసుకుంటూ పరుగులు తీశాయి. అదే సమయంలో వాడివాసల్‌కు ఇరువైపులా నిలిచిన యువకులు ప్రాణాలకు తెగించి ఆ ఎద్దులను అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.





ముప్పుతిప్పలు పెట్టిన ఎద్దులు..

ఈ పోటీల్లో కొన్ని ఎద్దులు మోపురాన్ని పట్టుకున్న యువకులను గిరగిరా తిప్పి దూరంగా పడేసి కాలితో తొక్కేందుకు ప్రయత్నించాయి. అదే సమయంలో యువకులు లాఘవంగా వాటి బారి నుండి తప్పించుకోగలిగారు. కొన్ని ఎద్దులు వాడివాసల్ కంటే ఎత్తుగా గాలిలోకి ఎగురుతూ దూకి యువకులకు చిక్కకుండా పరుగులు తీశాయి. మరికొన్ని ఎద్దులు వింత విన్యాసాలను సైతం ప్రదర్శించాయి. ఆద్యంతం ఆసక్తికరంగా వీరోచితంగా సాగిన ఈ జల్లికట్టు క్రీడలో ప్రాణాలకు తెగించి ఎద్దులను అణచివేసిన యువ వీరులకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అప్పటికప్పుడు బంగారు కాసులను అందజేశారు. పది రౌండ్లుగా సాగిన ఈ పోటీలు గురువారం సాయంత్రం 6.30 గంటలకు ముగిశాయి.

విజేతకు కారు బహుమతి

ఈపోటీల్లో యువక్రీడాకారుడు అభిసిద్ధర్ 20 ఎద్దులను అణచి విజేతగా నిలిచాడు. అతడికి లగ్జరీ కారుసహా విలువైన బహుమతులను జల్లికట్టు నిర్వాహకులు ప్రదానం చేశారు. ఇక 14 ఎద్దులను అణచి శ్రీధర్ ద్వితీయ స్థానం 10 ఎద్దులను అణచి విగ్నేష్ మూడో స్థానం, 9 ఎద్దులను అణచి అజయ్ నాలుగోస్థానంలో నిలిచాడు. అలంగానల్లూరు జల్లికట్టు విజేత అభిసిద్ధర్ అని నిర్వాహకులు ప్రకటించగానే తోటి యువవీరులంతా అతడిని భుజాలకెత్తుకుని మైదానం అంతటా తిప్పారు. ఈ సందర్భంగా అభిసిద్ధర్ మీడియాతో మాట్లాడుతూ ఈ జల్లికట్టులో పాల్గొన్న ఎద్దులు ఊహకందని విధంగా పట్టుచిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టాయని చెప్పారు. ఈ ఎద్దులను అణచివేయడానికి ముందుగానే వాటిని గురించిన సమగ్రమైన సమాచారాన్ని కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ఏది ఏమైనప్పటికి ప్రాణాలకు తెగించే 20 ఎద్దులను అణచివేయగలిగానని చెప్పారు.



తండ్రితో కలిసి జల్లికట్టు తిలకిస్తున్న ఉదయనిధి తనయుడు ఇన్బనిధి

తొలిసారిగా జనం ముందుకు మరో వారసుడు

మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ముని మనుమడు తొలిసారి జనంలోకి వచ్చాడు. అదీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అలంగనల్లూరు జల్లికట్టు క్రీడ తిలకించేందుకు తన తండ్రి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో కలిసి వచ్చారు. ఉదయనిధి తనయుడు ఇన్బనిధి లండన్‌లో చదువుతున్నాడు. ఫుట్‌బాల్ క్రీడాకారుడిగాను రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో అలంగనల్లూరు జల్లికట్టు తండ్రితోపాటు ఇన్బనిధి చూడడం గమనించిన మదురై వాసులు డీఎంకేకు చెందిన మరో రాజకీయ వారసుడు జనం ముందుకు వచ్చాడంటూ కామెంట్లు చేశారు.

బాహుబలి ఎద్దుకు ట్రాక్టర్ కానుక

అలంగానల్లూరు జల్లికట్టులో యువవీరులకు పట్టుపడకుండా పావుగంటకు పైగా మైదానంలో ముప్పుతిప్పలు పెట్టిన సేలం రైతు మోహన్‌కు చెదిన బాహుబలి ఎద్దు విజేతగా నిలిచింది. దీంతో మోహన్‌కు మంత్రి మూర్తి ట్రాక్టర్‌ను కానుకగా అందజేశారు.



జల్లికట్టులో ఒకరి మృతి

అలంగానల్లూరు జల్లికట్టులో ఎద్దు పొడవటంతో గాయపడిన ప్రేక్షకుడు పెరియసామి (55) మదురై రాజాజీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. ఈ పోటీల సందర్భంగా క్రీడాకారులు, పోలీసులు, ప్రేక్షకులు సహా సుమారు వందమంది ఎద్దులు పొడవటం, తొక్కిసలాట కారణంగా గాయపడ్డారు.



శ్రీలంక స్వస్థలాలకు చేరిన తమిళ జాలర్లు

ప్యారీస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలు నుంచి విడుదలైన 15 మంది తమిళ జాలర్లు బుధవారం రాత్రి విమానం ద్వారా నగరానికి చేరుకున్నారు. రామనాథపురం, నాగపట్నం జిల్లాలకు చెందిన 15 మంది జాలర్లు గత ఆగష్టు 27, నవంబరు 11వ తేదీల్లో మర బోట్లలో చేపల వేటకు వెళ్లారు. అయితే వారు అంతర్జాతీయ సరిహద్దులు దాటారనే కారణంగా శ్రీలంక నేవీ అధికారులు 15 మందిని అరెస్ట్ చేసి శ్రీలంక కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు. లంక నావికాదళం తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, లంక రాయబార కార్యాలయంతో చేసిన సంప్రదింపులు ఫలించడంతో శ్రీలంక న్యాయస్థానం 15 మంది తమిళ జాలర్లను విడుదల చేసింది. బుధవారం రాత్రి కొలంబో నుండి విమానంలో నగరానికి వచ్చిన జాలర్లను రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు ఆహ్వానించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లో వారి సొంతూళ్లకు సాగనంపారు.



మాజీ ఎంపీ పీఆర్ సుందరం (ఫైల్‌ఫోటో)

మాజీ ఎంపీ పీఆర్ సుందరం మృతి

- సీఎం స్టాలిన్ సంతాపం

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పీఆర్ సుందరం (73) గురువారం ఉదయం కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అన్నాడీఎంకే సీనియర్ నాయకుడైన పీఆర్ సుందరం 1996 నుంచి 2006 వరకు రెండుసార్లు రాశిపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా సేవలందించారు. 2014 నుండి 2019 వరకు నామక్కల్ పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత కొంతకాలం పాటు మరో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం వర్గంలో కొనసాగారు. ఆ తరువాత డీఎంకేలో చేరి పార్టీ ప్రచార విభాగం డిప్యూటీ కార్యదర్శిగా కొనసాగారు. సుందరం మృతిపట్ల డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయానుభవం కలిగిన సుందరం మృతి పార్టీకి తీరని లోటు అని, ఆయన మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నానని పేర్కొన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి





హార్స్‌రైడింగ్ చేస్తున్న యువతి



శ్రామికుల విగ్రహం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న బాలికలు





రంగుల రాట్నంపై తిరుగుతున్న మహిళలు



బీచ్‌లో కొత్తగా ఏర్పాటైన టీ షాపుల వద్ద గుమికూడిన జనం



ఐలాండ్ గ్రౌండ్ ఎగ్జిబిషన్ ప్రాంతంలో జెయింట్ వీల్స్ వద్ద గుమికూడిన జనం



మెరీనా తీరం.. జనసంద్రం

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కానుంపొంగల్ సందర్భంగా మెరీనాబీచ్ జనసంద్రంగా మారిపోయింది. రాజధాని నగరం చెన్నైలో ప్రతియేటా పశువుల పండుగ మరుసటి రోజు జరిగే కానుంపొంగల్ సందర్భంగా నగరవాసులు అత్యధికంగా సందర్శించే ప్రాంతం మెరీనా బీచ్ ప్రాంతమేనని చెబుతారు. గత రెండు దశాబ్దాలుగా కానుంపొంగల్ రోజున నగరం నలుమూలల నుంచి ప్రజలంతా మెరీనాబీచ్‌ను సందర్శిస్తుంటారు. ఆ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే నగరవాసులు మెరీనాబీచ్‌కు బయల్దేరారు. దీంతో ఉదయం పది గంటల నుండి మెరీనాబీచ్‌లోని లైట్‌హౌస్ ప్రాంతం నుండి అన్నాసమాధి ప్రాంతం వరకూ నగరవాసులు, పర్యాటకులు, సందర్శకులు గుమికూడారు. కానుంపొంగల్ సందర్భంగా లక్షలాదిమంది జనం మెరీనాబీచ్ సందర్శించేందుకు రావటంతో సముద్రంలో ఎవరూ స్నానం చేయకుండా పోలీసులు నిషేధం అమలు చేశారు. ఆ నిషేధ ఉత్తర్వులు ఉల్లఘించి ఎవరైనా సముద్రంలో స్నానం చేస్తూ నీట మునిగితే వారిని కాపాడేందుకు 200 మంది గజ ఈతగాళ్ళను సిద్ధంచేశారు. ఎళిలగమ్ భవనం ఎదుట ఉన్న శ్రామికుల విగ్రహ ప్రాంతం నుండి డీజీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహ ప్రాంతం వరకు మూడు పోలీసు కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. అక్కడక్కడా అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అగ్నిమాపక సిబ్బంది కూడా ఫైరింజన్‌లతో తీరమంతటా నిఘా వేయసాగారు. మెరీనాతీరంలో కానుంపొంగల్ జరుపుకునేందుకు వచ్చే నగర వాసుల కోసం ట్రాఫిక్ మార్పులు కూడా చేశారు. ఇక సాయంత్రం నాలుగు గంటల నుంచే మెరీనాతీరం పొడవునా ఇసుకవేస్తే రాలనంతగా జనం గుమికూడింది.

సమాచార ధ్వని

మూడవ 'కాశి తమిళ సంగమం'

● దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మూడవ వార్షిక 'కాశి తమిళ సంగమం' వేడుకలకు చెన్నై ఐఐటీ సిద్ధమవుతోంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై ఐఐటీ డైరెక్టర్ కామకోటి తెలిపారు. తమిళనాడు, వారణాసికి మధ్య ఉన్న సంబంధాలు బలపరిచేలా ఫిబ్రవరి 15 నుంచి 24వ తేది వరకు కాశి తమిళ సంగమం నిర్వహించనున్నారు. 'ఒకే భారతం ఉన్నత భారతం' శీర్షికన నిర్వహించనున్న ఈ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, రైతులు, పారిశ్రామికవేత్తలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులు, మహిళలు, పరిశోధకులు పాల్గొనవచ్చు. రాష్ట్రం నుంచి 5 బృందాలుగా 1,000 మంది పాల్గొననున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు http://kashitamil.iitm.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పిల్లల భద్రతా యూనిట్‌లో ఉద్యోగాలు

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల భద్రతా యూనిట్, నార్త్ చెన్నై విభాగంలో ఒక అదనపు భద్రతా అధికారి, రెండు సోషల్ వర్కర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీచేయనున్నారు. భద్రతా అధికారి పోస్టుకు రూ.27,804, సోషల్ వర్కర్ పోస్టుకు రూ.18,536 వేతనం అందించనున్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా పిల్లల భద్రత కార్యాలయంలో దరఖాస్తు చేయవచ్చు. మరిన్ని వివరాలకు 6369114871 అనే నెంబరు సంప్రదించవచ్చు.

రేపటితో ముగియనున్న 'ఫ్లవర్ షో'

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెమ్మొళి పార్క్‌లో నిర్వహిస్తున్న 'ఫ్లవర్ షో' శనివారంతో ముగియనుంది. ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటుచేస్తున్న ఫ్లవర్ షోను నగరవాసుల కోసం రెండేళ్ల క్రితం ప్రారంభించారు. మూడవ ప్రదర్శనకు పిల్లలు, పెద్దలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటలకు వరకు ఈ ప్రదర్శనకు ప్రజలను అనుమతించనుండగా, పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 ప్రవేశ రుసుముగా వసూలుచేస్తున్నారు.

11న వడలూరు సత్యజ్ఞానసభలో తైమాస జ్యోతి దర్శన వేడుకలు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరులోని అరుళ్‌ప్రకాశ వళ్లలార్ (జీవ కారుణ్య ఆధ్యాత్మికవేత్త రామలింగ అడిగళార్) నెలకొల్పిన సత్యజ్ఞానసభలో వార్షిక తైపూస జ్యోతి దర్శన వేడుకలు ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు ఆ సభ నిర్వాహకులు తెలిపారు. జీవితపర్యంతం జీవహింస వ్యతిరేకోద్యమం చేస్తూ, ఆధ్యాత్మిక బోధనల ద్వారా మానవాళిని ఉత్తేజపరచిన వళ్లలార్ రామలింగ అడిగళార్ తైమాసంలో వచ్చే పూస (పుష్యమి) నక్షత్ర పర్వదినాన్ని ఈ సభ వద్ద జ్యోతిస్వరూపులై అంతర్థానమై ముక్తినొందారు. అప్పటి నుంచి ప్రతియేటా ఆ దివ్యక్షేత్రం వద్ద తైపూస వేడుకల వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ యేడాది తమిళ మాసం తై నెలలో రెండు పూస (పుష్యమి) నక్షత్ర తిథులున్నాయి. వీటిలో బుధవారం పూసం తిథిని మాస తిథి అని పిలుస్తారని, ఫిబ్రవరి 11న వచ్చేదే తైపూస తిథి అని, ఆరోజునే తైపూస జ్యోతి దర్శనం సత్యజ్ఞాన సభలో జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తైపూస వేడుకలు ఫిబ్రవరి 10న ధ్వజరోహణంతో ప్రారంభమవుతాయి. 13న వళ్లలార్ సిద్ధి పొందిన మేట్టుకుప్పంలోని పవిత్ర గది తెరుస్తామని తెలిపారు.

పొంగల్ బహుమతి తీసుకెళ్లండి

● కార్డుదారులకు సహకార శాఖ సూచన

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లడంతో, పొంగల్ బహుమతి పొందని వారు రేషన్ దుకాణాలకు వెళ్లి వాటిని తీసుకోవచ్చని సహకార శాఖ తెలిపింది. పొంగల్ సందర్భంగా బియ్యం రేషన్‌కార్డుదారులకు కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరకు గడ, చీర, ధోవతి ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా, గతంలో అందజేసిన పొంగల్ బహుమతుల్లో రూ.1,000 నగదుండగా, ఆర్థిక లోటు కారణంగా ఈ ఏడాది పొంగల్ బహుమతిలో నగదు ప్రకటన లేదు. దీంతో, ఈ బహుమతులు తీసుకొనేందుకు పలువురు ఆసక్తి చూపలేదు. కాగా, బహుమతుల పంపిణీ ఈ నెల 13వ తేదీతో ముగియగా, 70 శాతం మంది మాత్రమే వీటిని తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, స్వగ్రామాలకు వెళ్లడంతో పొంగల్ బహుమతి పొందని వారు, రేషన్ దుకాణాలకు వెళ్లి వాటిని తీసుకోవచ్చని సహకార శాఖ తెలియజేసింది.

నేటితో ముగియనున్న ఈరోడ్ నామినేషన్ల ఘట్టం

అడయార్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఉప పోరులో డీఎంకే కూటమి అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్, డమ్మీ అభ్యర్థిగా సీతాలక్ష్మి నేడు నామినేషన్ వేయనున్నారు. దీంతో ఈరోడ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద గట్టి బందోబస్తు కల్పించనున్నారు. నామినేషన్లను 18వ తేదీ పరిశీలన, 20వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను అదేరోజు సాయంత్రం ప్రకటిస్తారు. వచ్చే నెల 5వ తేదీ పోలింగ్, 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడుతారు.

మునియాండి పొంగల్ వేడుకల్లో 10 వేల మందికి విందు



విందు భోజనం చేస్తున్న భక్తులు - మునియాండిసామికి ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మహిళలు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళం సమీపం ఎస్. గోపాలపురం గ్రామంలోని మునియాండిసామి ఆలయంలో పొంగల్ వేడుకల సందర్భంగా 100 పొట్టేళ్లు, 150 కోళ్ళను స్వామివారికి బలిచ్చి 10 వేలమందికి మాంసాహార విందు ఏర్పాటు చేశారు. దేశవిదేశాల్లో మునియాండి పేరుతో మాంసాహార భోజనశాలలు నడుపుతున్న హోటల్ యజమానులు ఈ మెగా విందులో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరి రాష్ట్రాలు, మలేసియా, దుబాయ్‌లో మదురై మునియాండి పేరుతో హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుతున్న యజమానులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ముందుగా 250 మది యువతులు మునియాండిసామి ఆలయానికి క్షీర కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అదే సమయంలో స్వామివారికి సారె కూడా మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. గురువారం ఉదయం 11 గంటల కల్లా 60 బస్తాల బియ్యాన్ని ఉడికించి, మాంసాహార వంటలను సిద్ధం చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గోపాలపురం, చెంగపట్టి, పుదుపట్టి, కున్నత్తూరు, తిరుమంగళం, డి. కల్లుపట్టి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది మాంసాహార విందులో పాల్గొన్నారు.

కేరళలో పడిన బెలూన్

● పొల్లాచ్చి 'ఇంటర్నేషనల్ బెలూన్ ఫెస్టివల్'లో ఘటన



బెలూన్ నుంచి బయటకు వస్తున్న పైలెట్లు - బెలూన్ పరికరాలను తీసుకెళ్తున్న నిర్వాహకులు

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చిలో జరుగుతున్న ఇంటర్నేషనల్ బెలూన్ ఫెస్టివల్‌లో ఎగురేసిన భారీ బెలూన్ కేరళ రాష్ట్రం పాలక్కాడు పొలాల్లో పడింది. పొల్లాచ్చిలో ఈ నెల 14న ప్రారంభమైన బెలూన్ ఫెస్టివల్ గురువారంతో ముగిసింది. బుధవారం ముగ్గురు పైలెట్లతో ఎగిరిన భారీ బెలూన్ పాలక్కాడు పత్తాన్‌చేరిలోని పొలాల్లో దిగింది. ఘటన జరిగిన గంట అనంతరం నిర్వాహకులు ఆ ప్రాంతానికి చేరుకుని బెలూన్ కింద చిక్కుకున్న ముగ్గురు పైలెట్లను రక్షించారు. సరైన పరిమాణంలో ఇంధనం లేకపోవడంతో అనుకున్న ప్రదేశంలో ఈ బెలూన్ దిగలేదని ప్రాథమిక సమాచారం. కాగా, మంగళవారం ఇలాగే ఓ భారీ బెలూన్ ఇంధనం అయిపోవడంతో కన్నిమారి ప్రాంతంలో దిగిన విషయం తెలిసిందే.

బిల్వ పత్రాల అలంకరణలో సుబ్రమణ్యస్వామి



బిల్వ పత్రాల అలంకరణలో స్వామివారు - వేడుకల్లో ఆలయ అధికారులు, భక్తులు

తిరుత్తణి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కానుం పొంగల్ సందర్భంగా బిల్వ పత్రాల అలంకరణలో సుబ్రమణ్యస్వామి భక్తులకు దర్శమిచ్చారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో పొంగల్ సందర్భంగా భక్తులు రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో, కానుం పొంగల్ సందర్భంగా వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధన నిర్వహించారు. స్వామివారిని 1,008 బిల్వ పత్రాలతో అలంకరించి కొండ ఆలయం నుంచి తిరుత్తణి నగరానికి వేంచేసి, ప్రధాన వీధుల్లో అర్ధరాత్రి వరకు విహరించారు. ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ధర్మకర్తల మండలి చైర్మెన్ శ్రీధరన్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈరోడ్‌లో ప్రచారం ప్రారంభించిన డీఎంకే



ప్రచారం మంత్రి ముత్తుస్వామి, డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న చంద్రశేఖర్ ప్రచారం ప్రారంభించారు. ఈ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతితో ఫిబ్రవరి 5వ తేది ఉప ఎన్నిక జరుగనుంది. ఎన్నికలో తాము పోటీబోమని కాంగ్రెస్ స్పష్టం చేయడంతో, కూటమిలో భాగంగా డీఎంకే అభ్యర్థిగా చంద్రకుమార్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, డీఎండీకే, బీజేపీ బహిష్కరించాయి. ఇక, నామ్ తమిళర్ పార్టీ తరపున సీతాలక్ష్మి పోటీచేస్తున్నట్లు ఆ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ ప్రకటించారు. కాగా, ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ విజయాన్ని చాలెంజ్‌గా తీసుకున్న మంత్రి ముత్తుస్వామి, లక్షకు పైగా మెజార్టీతో విజయం సాధించేలా కృషిచేయాలని పార్టీ కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో, పెరియార్ నగర్‌లో మంత్రి ముత్తుస్వామి, అభ్యర్థి చంద్రకుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

డీఎంకే కార్యకర్తలకు పొంగల్ కానుకలు

తిరుత్తణి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు నార్త్ యూనియన్, పళ్లిపట్టు నగర డీఎంకే ఆధ్వర్యంలో కార్యకర్తలకు పొంగల్ కానుకల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే పాల్గొని, కార్యకర్తలకు పార్టీ క్యాలెండర్, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో నార్త్ యూనియన్ కార్యదర్శి సీజే శ్రీనివాసన్, పట్టణ కార్యదర్శి సీజే సెంథిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో ఫాస్ట్ ఇమ్మిగ్రేషన్

అడయార్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫాస్ట్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానం గురువారం సాయంత్రం నుంచి అమల్లోకి వచ్చింది. దీనిని కేంద్ర హోం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే విదేశాల నుంచి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యే ప్రయాణికుల ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. అయితే, ఈ విధానం కింద ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరుకునే ప్రయాణికుల్లో పెద్దలకు రూ.2 వేలు, చిన్నారులకు రూ.1000 చొప్పున చెల్లించి, తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

తిరుచెంగోడులో కోడిపుంజుల జల్లికట్టు

అడయార్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో కోడిపుంజులతో జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల కోసం వృత్తాకారంలో బరి గీసి అందులో కోడిపుంజును ఉంచారు. ఈ పుంజును బరిలో దిగే ఆటగాడు నిర్ణీత సమయంలో పట్టుకోవాల్సి ఉంటుంది. బరిలోకి దిగే ఆటగాడి కళ్లకు గంతలు కట్టేస్తారు. అలాగే, కోడిపుంజు ఒక కాలుకు తాడుతో కట్టి, మరో చివర తాడును ఆటగాడి కాలుకు కడుతారు. ఆటగాడు వృత్తాకార బరి నుంచి బయటకు వెళ్ళకుండా తిరుగుతూ నిర్ణీత సమయంలో కోడిపుంజును పట్టుకోవాల్సి ఉంటుంది. కోడిని పట్టుకునే క్రమంలో ఈ బరిని దాటినా లేదా నిర్ణీత సమయంలోగా కోడిపుంజును పట్టుకోలేకపోయినా అతడు ఓడిపోయినట్టుగా ప్రకటించారు. ఈ పోటీలో చిన్నారులు, మహిళలు యువతీ యువకులుకూడా పాల్గొనేందుకు పోటీపడ్డారు. అలాగే, ఈ పోటీలను తిలకించేందుకు ఆ ప్రాంతవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వాసులు కూడా భారీగా తరలివచ్చారు.

నేత్రపర్వంగా నటరాజస్వామి తెప్పోత్సవం

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చిదంబరం నటరాజ స్వామి ఆలయంలో 22 ఏళ్ల అనంతరం బుధవారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవం కన్నులపండువగా సాగింది. కడలూరు జిల్లా చిదంబరం నటరాజ స్వామి ఆలయ దర్శన వేడుకల ముగింపు రోజున ఆలయ కొలను జ్ఞానప్రకాశర్‌లో తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. 22 ఏళ్ల అనంతరం నిర్వహించిన తెప్పోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బలవన్మరణానికి దారితీసిన కుటుంబ కలహాలు

● పిల్లల్ని హతమార్చి తల్లిదండ్రుల ఆత్మహత్య

ప్యారీస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా ఈరోడ్ జిల్లా సిలివలూర్‌లో ఇద్దరు పిల్లల్ని హతమార్చిన తల్లిదండ్రులు.. తాము బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా ... సిలివలూర్‌కు చెందిన ధనశేఖరన్ (36) విరియంకిలట్రు ప్రాంతానికి చెందిన బాలామణి (33) దంపతులకు వందన (10) అనే కుమార్తె, మోనీస్ (7)అనే కుమారుడు ఉన్నారు. వెల్లకోవిల్ గార్మెంట్ ఫ్యాక్టరీలో భార్యాభర్తలు పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే ధనశేఖరన్ ఉద్యోగానికి సక్రమంగా వెళ్లకపోవడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అప్పులు కూడా పెరిగిపోవడంతో. బుధవారం భార్యాభర్తల మధ్య మళ్లీ వాగ్వివాదం చోటుచేసుకొంది. దీంతో ఆగ్రహం చెందిన ఆ దంపతులు పురుగుల మందును శీతలపానీయంలో కలిపి తమ పిల్లలకు ఇచ్చి, తాము కూడా తాగారు. అయితే కడుపునొప్పి భరించలేకపోయిన మోనీస్ కేకలేయడంతో ఇరుగుపొరుగు వెళ్లి నలుగురినీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స ఫలించక ఆ నలుగురూ మృతిచెందారు. ఈ విషాద ఘటనపై సిలివలూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరణ

● అవనియాపురంలో బంధువుల ఆందోళన



ధర్నాలో పాల్గొన్న అవనియాపురం ప్రజలు

ప్యారీస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అవనియాపురం జల్లికట్టు పోటీల్లో ఎద్దు కుమ్మి మరణించిన నవీన్‌కుమార్ (23) మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించిన బంధువులు ధర్నాలో పాల్గొన్నారు. అవనియాపురంలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టు పోటీ మైదానంలో ఎద్దులను అదుపు చేసేందుకు పలువురు వీరులు తమ సాహసాన్ని ప్రదర్శించారు. ఈక్రమంలో నవీన్‌కుమార్ ఎద్దు కుమ్మడంతో తీవ్రంగా గాయపడటంతో అతడిని మదురై ప్రభుత్వ రాజాజీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక బుధవారం మరణించిన నవీన్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు అతడి బంధువులకు అప్పగించేందుకు యత్నించారు. అయితే నవీన్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ బంధువులు మృతదేహాన్ని తీసుకోకుండా ఆస్పత్రి ఎదుటే ధర్నా నిర్వహించారు. దీనితో జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ఈ వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.3 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. అయితే ఈ పరిహారాన్ని పెంచాలని కోరుతూ గురువారం కూడా అవనియాపురం ప్రాంతంలో మళ్లీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు వారికి మద్దత్తుగా పాల్గొన్నారు.

27 నుంచి మద్రాస్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ యూనివర్శిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు 'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీ షా సాహిత్యం - బహుముఖీనత' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. మెరీనా ప్రాంగణంలో జరుగనున్న ఈ సదస్సుకు తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు సంచాలకులుగా వ్యవహరించనున్నారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం జరుగనుండా, ఈ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా హాజరుకానున్నారు. అదేవిధంగా విశిష్ట అతిథిగా హైదరాబాద్‌లోని యోగాలయా రీసెర్చ్ సెంటర్‌కు చెందిన విశ్వర్షి డాక్టర్ వాసిలి వసంతకుమార్, గౌరవ అతిథిగా ఆఫ్రికాకు చెందిన ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్, ప్రత్యేక అతిథిగా గుంటూరుకు చెందిన రచయిత్రి, విమర్శకులు ఆచార్య సీహెచ్ సుశీలమ్మ, ఆత్మీయ అతిథులుగా అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ తెలుగుశాఖ మాజీ అధ్యక్షులు ఆచార్య షేక్ మస్తాన్, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య హాజరుకానున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగుశాఖాధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు కీలకోపన్యాసం చేయనున్నారు. అదేవిధంగా 28వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్సు సమాపనోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర, విశిష్ట అతిథిగా తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, గౌరవ అతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య గంపా వెంకటరామయ్య, ప్రత్యేక అతిథిగా విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం కేంద్ర కమిటీ సభ్యులు నడింపల్లి తిరుపతి వెంకట ప్రసాద్ వర్మ, ఆత్మీయ అతిథులుగా మదురై కామరాజ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ, రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య హాజరుకానుండగా, విజయనగరంలోని ప్రభుత్వ మహారాజ సంస్కృత కళాశాల విశ్రాంతాచార్యులు డాక్టర్ సోమయాజుల గోపాలరావు సమాపనోత్సవ సందేశం ఇవ్వనున్నారు. ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులేనని ఆచార్య విస్తాలి విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

తిరువణ్ణామలైలో ఆదిదంపతుల గిరిప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న అన్నామలైయార్ సమేత ఉన్నాములై అమ్మవారు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శైవక్షేత్రం తిరువణ్ణామలైలో గురువారం ఉదయం ఉన్నామలై సమేత అరుణాచలేశ్వర స్వామివారు గిరి ప్రదక్షిణ చేశారు. సర్వాలంకరణశోభితంగా గిరి ప్రదక్షిణకు విచ్చేసిన స్వామి, అమ్మవారిని భక్తులు దారిపొడవునా కర్పూరనీరాజనాలతో ఘన స్వాగతం పలికారు. అరుణాచలేశ్వరాలయంలో కార్తీక మహాదీపోత్సవం తర్వాత అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవాల్లో తిరువూడల్ (అలకపాన్పు ఎక్కిన అమ్మవారిని అరుణాచలేశ్వరస్వామి బుజ్జగించడం) వేడుకలు ప్రధానమైనవి. ప్రతియేటా తమిళ తై మాసం రెండో రోజు ఈ వేడుకలు జరుగుతాయి. ఆ ప్రకారం బుధవారం ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు అభితకుచాంబాళ్ సమేత అరుణాచలేశ్వర స్వామి ప్రత్యేక వాహనంలో వేంచేసి, నందియం పెరుమాళ్ (నందీశ్వరుడికి)కు ఆశీర్వదించారు. ఆ తర్వాత తిట్టివాసల్ వద్ద సూర్యభగవానుడికి దర్శనమిచ్చారు. అనంతరం అరుణాచలేశ్వరస్వామి, పరాశక్తి అమ్మన్, సుందర మూర్తి నాయనార్ వేర్వేరు వాహనాల్లో మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్ల మధ్య తిరువూడల్ ఉత్సవం నిర్వహించారు. ఈ ఆదిదంపతుల మధ్యలో శైవభక్తశిఖామణి సుందరర్ రాయబారానికి వెళ్ళారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ఆ తర్వాత స్వామివారు పరాశక్తి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. చివరగా తిరుమంజన గోపురం వీధిలోని కుమకోవిల్‌కు వేంచేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం స్వామివారు ఆలయం నుంచి గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. మంగళవాయిద్యాల, శైవపండితుల మంత్రోచ్చారణ నడుమ గిరి ప్రదక్షిణ మార్గంలోకి ప్రవేశించారు. అక్కడి నుండి సుమారు 14 కి.మీ. వరకూ గిరి ప్రదక్షిణ ముగించారు. ఉదయం 11 గంటలకు గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని స్వామివారు ఆలయంలోకి ప్రవేశించారు. ఆ తరువాత రెండో ప్రాకారం వద్ద అలకపాన్పు వహించే స్వామివారిని అమ్మవారు బుజ్జగించే మరుఊడల్ వేడుకలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్యారీస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వందవాసి హైవే మీద వెళ్తున్న ఓ బైక్ రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే... తిరువణ్ణామలై జిల్లా మంజెంపూండి గ్రామానికి చెందిన చిన్నదురై (58) తన భార్య రాణి (53)తో కలిసి గురువారం ఉదయం కాంచీపురంలోని తన కుమారుడి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా దారిలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన వారిలో చిన్నదురైకు స్వల్పగాయాలతో బయటపడగా, రాణి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. రాణి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించిన పోలీసులు కేసు నమోదు చేసేకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కర్ పేలి వృద్ధుడికి గాయాలు



పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) ఆంబూరులో వంట చేస్తుండగా కుక్కర్ పేలిన ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిరువళ్లూర్ జిల్లా ఆంబూరు మున్సిపాలిటీ ఏ-కస్పా ప్రాంతానికి చెందిన గుణశేఖర్, గురువారం ఉదయం తన ఇంట్లో వంట చేసుకుంటున్నాడు. ఆ సమయంలో కుక్కర్ పేలి, కుక్కర్ మూత గుణశేఖర్ ముఖానికి తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. పేలుడు శబ్దం విని అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు గుణశేఖర్‌ను ఆంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. గుణశేఖర్ ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆంబూరు నగర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాదయాత్ర భక్తులపై దూసుకెళ్లిన కారు

● ఇద్దరి మృతి



మృతులు కేశవన్, అడైక్కల్‌రాజా (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒట్టాన్‌సత్రం సమీపంలో పాదయాత్ర భక్తులపై కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మదురై మీనాక్షిపురానికి చెందిన అళగర్ కుమారుడు కేశవన్ (17), వడివేలన్ వీధికి చెందిన అడైక్కలరాజా (27), అదే ప్రాంతానికి చెందిన పలు కుటుంబాలతో కలసి పళని సుబ్రమణ్యస్వామి ఆలయానికి పాదయాత్రగా బయల్దేరారు. వీరు గురువారం తెల్లవారుజామున ఒట్టాన్‌సత్రం సమీపం సాలైపుదూర్ ప్రాంతంలో నడచి వెళుతున్నారు. అదే సమయంలో ఒట్టాన్‌సత్రం సమీపం కన్నివాడికి చెందిన భువనేశ్వరన్, తన అత్త కుమార్తెకు పురిటినొప్పులు రావడంతో ఆమెను కారులో ఆస్పత్రికి తీసుకెళ్లా సాలైపుదూర్ సమీపంలో హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే వెళుతున్న భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో కేశవన్, అడైక్కలరాజా ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో స్వల్పగాయాలైన వారిని చుట్టుపక్కల వారు ఒట్టాన్‌సత్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఒట్టాన్‌సత్రం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రౌడీ బాంబ్ శరవణన్ అరెస్టు



ఐసీఎఫ్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా పరారీలో ఉన్న రౌడీ శరవణన్ అలియాస్ బాంబ్ శరవణన్‌ను బుధవారం అర్ధరాత్రి వ్యాసార్పాడి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు చుట్టుముట్టగానే శరవణన్ నాటుబాంబులతో దాడిచేసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడి కాలిపైన తుపాకీతో కాల్చారు. ఆ తర్వాత శరవణన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

18 నుంచి డీఎంకే న్యాయ సదస్సు

● ఎన్ఆర్.ఇళంగో వెల్లడి

అడయార్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే న్యాయ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ రాష్ట్రస్థాయి మూడో సదస్సు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ సీనియర్ న్యాయవాది ఎన్.ఆర్.ఇళంగో వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ కీల్పాక్కంలోని సెయింట్ జార్జ్ స్కూల్ ప్రాంగణంలో డీఎంకే న్యాయ విభాగం ఆధ్వర్యంలో మూడో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించనున్నామని, సదస్సు ప్రవేశ ద్వారం అరివళగన్ పేరుతోనూ, ఆడిటోరియంను కలైంజర్ పేరుతో నిర్మిస్తున్నామన్నారు. ఈ సదస్సును రాష్ట్ర న్యాయ శాఖామంత్రి రఘుపతి, రాష్ట్ర సాగునీటి శాఖామంత్రి దురైమురుగన్ ప్రారంభిస్తారని వెల్లడించారు. డీఎంకే న్యాయ విభాగంలో 10 వేల మంది అడ్వకేట్లు ఉన్నారన్నారు. తమిళనాడులో మినీ ఎమర్జెన్సీ పాలన సాగలేదని, రాజ్యాంగానికి లోబడే పాలన సాగుతుందని, వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించేలా పాలన సాగుతుందని వెల్లడించారు.

రెండు రోజుల్లో రూ.454 కోట్ల మద్యం విక్రయాలు

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా రెండు రోజుల్లో రూ.454 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. రాష్ట్రంలో టాస్మాక్ సంస్థ 4,500 మద్యం దుకాణాల ద్వారా ఈ నెల 13న రూ.185.65 కోట్లు, 14న రూ.268.46 కోట్లు రెండు రోజుల్లో మొత్తం రూ.454 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఇదే సమయంలో గత ఏడాది పొంగల్ సందర్భంగా రూ.450 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

ఈ ప్రపంచంలో అతిపెద్ద అబద్ధం అదే

● అనుపమ పరమేశ్వరన్

'జీవితాంతం నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను' అనే మాటలే ఈ ప్రపంచంలోనే అతిపెద్ద అబద్ధమని హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ అంటున్నారు. 'ప్రేమమ్' మూవీతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ భామ... 'కొడి', 'తళ్ళిపోగాదే', 'సైరన్' వంటి తమిళ చిత్రాల్లో నటించారు. అయితే, కోలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో బ్రేక్ రాకపోవడంతో ఆమె తెలుగులో స్థిరపడ్డారు. ఒకటి రెండు తమిళ చిత్రాల్లో నటిస్తున్నారు.



ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ప్రేమ' (లవ్) గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. లవ్ పై మీ అభిప్రాయం ఏంటి అని అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ, 'జీవితాంతం నిన్ను ప్రేమిస్తాను' అనే మాటలే ఈ ప్రపంచంలోనే అతిపెద్ద అబద్ధం అని అన్నారు.'నా ప్రాణం నీవే.. నీవు లేకుండా నేను లేను'అంటూ నమ్మబలికే ప్రేమికుల చేతుల్లో చిక్కుకునివున్న అమ్మాయిలు...దయచేసి ప్రేమికుల కంబంధ హస్తాల నుంచి విముక్తులు కావాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

దృష్టంతా 'ఇండియన్-3'పైనే

● దర్శకుడు శంకర్



ఇకపై తన దృష్టంతా 'ఇండియన్-3' సినిమాపై కేంద్రీకృత మై వుందని ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ తెలిపారు. ఆయన తాజాగా దర్శకత్వం వహించిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి పాన్ ఇండియా మూవీగా విడుదలై ప్రేక్షకులను నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో శంకర్ మాట్లాడుతూ, "గేమ్ ఛేంజర్ ప్రాజెక్టును పూర్తి చేశాను. ఇపుడు 'ఇండియన్-3' మిగిలివుంది. అది ఇపుడు ప్రారంభిస్తే మరో ఆరు నెలల్లో మూవీని విడుదల చేసే అవకాశం ఉంది. మూడో భాగంలో గ్రాఫిక్ వర్క్స్ ఎక్కువగా ఉన్నాయి' అన్నారు. ఇదిలావుంటే, 'ఇండియన్-3' నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్‌కు దర్శకుడు శంకర్‌కు మధ్య వివాదం నెలకొంది. దీని పరిష్కారం కోసం పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. దీంతో విదేశాల్లో ఉన్న ఆ చిత్ర హీరో కమల్ హాసన్ కోసం ఇటు శంకర్, అటు నిర్మాణ సంస్థ ఎదురు చూస్తుంది. ఆయన వచ్చాక దర్శకుడు, నిర్మాణ సంస్థల మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించాక, 'ఇండియన్-3' మిగిలిన పనులను పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ఫౌండ్ ఫుటేజ్ హర్రర్ మూవీ 'మర్మర్'

తమిళ చిత్రజ్యోతి

తమిళ చిత్రపరిశ్రమలో 'మర్మర్' పేరుతో తొలిసారి ఫౌండ్ ఫుటేజ్ హర్రర్ మూవీ తెరకెక్కుతోంది. ఫౌండ్ ఫుటేజ్ కోలీవుడ్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆ చిత్ర దర్శకుడు హేమ్‌నాథ్ నారాయణన్ అంటున్నారు. కథతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా పూర్తి చేశారు. ఎస్‌పీకే పిక్చర్స్, స్టాండ్ ఎలోన్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. ఆడియో, ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేసి ఫిబ్రవరిలో సినిమా రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు హేమ్‌నాథ్ మాట్లాడుతూ, 'తమిళ చిత్రపరిశ్రమలోనే ఫౌండ్ ఫుటేజీ టెక్నాలతో హర్రర్ మూవీ తెరకెక్కించడం ఇదే తొలిసారి. 'మర్మర్' ఫస్ట్‌లుక్ ప్రతిఒక్కరినీ ఆకర్షించేలా వెరైటీగా డిజైన్ చేసాము.. ఈ పోస్టరులో 'కపో కపి కపిస్తు' అనే పదాలున్నాయి. వాటి వెనుక వున్న రహస్యమే ఈ సినిమా కథ. సినిమా ప్రారంభం నుంచి చివరివరకు ప్రేక్షకులు భయానక అనుభూతిని పొందేలా సీట్ ఎడ్జ్ మూవీగా రూపొందిస్తున్నాం. అందుకే ఇందులో నటించే నటీనటుల పేర్లను కూడా దర్శకుడు వెల్లడించలేదు.



లొకేషన్‌లో దర్శకుడు హేమ్‌నాథ్

గేయ రచయితగా విజయ్ సేతుపతి

ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి 'బన్ బట్టర్ జామ్' మూవీ కోసం గేయ రచయితగా మారారు. ఈ పాటను హీరో సిద్ధార్థ్ గానం చేయడం విశేషం. రెయిన్ ఆఫ్ ఆరోస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై సురేష్ సుబ్రమణియన్ నిర్మాణ సారథ్యంలో రాఘవ్ మిర్దాథ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'బిగ్ బాస్' ఫేం రాజు, ఆద్య ప్రసాద్, భవ్య త్రిక హీరోహీరోయిన్లు. 'జెన్ జడ్' జనరేషన్ రిలేషన్‌షిప్‌లో హాస్యభరిత, ఫ్యామిలీ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఈ మూవీ కోసం 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి తొలిసారి గేయరచయితగా మారారు. ప్రేమలోని లోతైన భావాలను వ్యక్తం చేసేలా శ్రావ్యమైన ట్యూన్‌ను సంగీత దర్శకుడు నివాస్ కె.ప్రసన్న సమకూర్చారు. ఈ ట్యూన్‌కు అనుగుణంగా గేయరచన ఉండాలని భావించిన మ్యూజిక్ డైరెక్టర్... తన స్నేహితుడైన విజయ్ సేతుపతిని సంప్రదించగా, ఆయన పాట రాశారు. ఈ పాట హీరో సిద్ధార్థ్‌తో కలిసి 'జైలర్'లో 'కావాలా' పాటపాడిన శిల్పారావు నేపథ్యగానం చేశారు. ఈ పాటకు బాబీ మాస్టర్ నృత్యాలు సమకూర్చగా, చెన్నై నగరంలోనే చిత్రీకరించారు. ఇతర పాత్రల్లో శరణ్య, దేవదర్శిని, చార్లీ, మైఖేల్ తంగదురై, వీజే పుష్ప పోషించారు.



'బన్ బట్టర్ జామ్'లో ఓ దృశ్యం





చిల్డ్రన్స్ పార్కులో ఆటవస్తువులు కొనుగోలు చేస్తున్న యువతులు



వండలూరు జూలోకి వెళుతున్న నగరవాసులు

ఘనంగా 'కానుం పొంగల్'

● పర్యాటక ప్రాంతాలకు పోటెత్తిన జనం ● రాష్ట్రవ్యాప్తంగా కిటకిటలాడిన సందర్శనా స్థలాలు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'కానుం పొంగల్' సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు క్రిక్కిరిసిపోయాయి. పార్కులు, జూపార్కులు, నదులు, సముద్ర తీర ప్రాంతాలు.. ఇలా ఒకటేమిటి అన్ని ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. రాష్ట్రంలో కానుం పొంగల్‌కు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. సంగకాలం నుండి నేటి కృత్రిమ మేధోపరిజ్ఞానాభివృద్ధి కాలం వరకు కానుం పొంగల్ విశిష్టతలో ఎన్నో మార్పులు జరిగాయి. సంక్రాంతి పండుగల తర్వాత గురువులను శిష్యులు దర్శించటం, దంపతులు అత్తమామలు, లేదా తల్లిదండ్రుల ఆశీస్సులందుకునేవారు. దక్షిణాది జిల్లాల్లో యేడాదిపొడవునా కాయకష్టం చేసిన రైతుకూలీలు పెత్తందార్లు, మోతుబరి రైతులను కలుసుకుని విరివిగా కానుకలు పొందుతుండేవారు. సమీప ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు వెళ్ళి రోజంతా అక్కడే భక్తిగీతాలు పాడుకుంటూ సందడి చేసేవారు. కాలగమనంలో ఈ పాత పద్ధతులు మాయమయ్యాయి. ప్రస్తుతం కానుం పొంగల్ అంటే ఉద్యానవనాలకు వెళ్లడం, ఆటాపాటలతో సందడి చేయడం ఆనవాయితీగా మారింది.. ఆ దిశగానే గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కానుం పొంగల్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జనంమంతా సమీప ప్రాంతాల్లోని ఉద్యానవనాలు, దేవాలయాలు, చెరువుగట్లు, నదీ తీరాలు, సముద్రతీరాలకు కుటుంబ సహా వెళ్ళారు. నగరంలో, సబర్బన్ ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా ఉదయం నుంచే మెరీనా బీచ్‌కు చేరుకున్నారు. సముద్రతీరానికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోయినా నగరవాసులు బీచ్ అంతా ఉన్న దుకాణాల్లో తినుబండారాల కోసం పోటీపడ్డారు. అదే సమయంలో చిన్న పిల్లలు పీచుమిఠాయి కోసం ఎగబడ్డారు. రంగుల రాట్నం ఎక్కేందుకు, తుపాకీతో బెలూన్ల కాల్చేందుకు బారులు తీరారు. ప్రతిరోజూ లభించే కారంపూత మామిడి ముక్కలు, మసాలా చెన్నా, ఫ్రై చేసిన చేపముక్కలను ఆరగించారు. బీచ్‌లో ఎప్పటిలాగే గుర్రపు సవారీ చేయడానికి కూడా బాలబాలికలు పోటీపడ్డారు. జనసంద్రంగా మారిన మెరీనాబీచ్‌లో జేబు దొంగతనాలు జరుగకుండా పోలీసులు నిఘా వేశారు. ఇదే విధంగా నగరం చుట్టూ ఉన్న ఉద్యానవనాలల్లోనూ సందర్శకుల సందడి కూడా అధికమైంది. ఇదే విధంగా బిసెంట్‌నగర్ సముద్రతీరం, తిరువాన్మియూరు బీచ్, కోవలం బీచ్, గిండి చిల్డ్రన్స్ పార్కు, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులో వినోద కేంద్రాలలోనూ సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మెరీనాబీచ్ సహా నగరమంతటా కానుం పొంగల్ సందర్భంగా సుమారు 16 వేల మంది పోలీసులు భద్రతా విధులు నిర్వర్తించారు.



ఏనుగు బొమ్మ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న దంపతులు



ఐ లవ్ గిండీ స్పాట్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న ఓ కుటుంబ సభ్యులు

వండలూరు జూలో..

వండలూరు జంతు ప్రదర్శనశాల గురువారం ఉదయం నుండే సందర్శకులతో నిండిపోయింది. ఆ జంతు ప్రదర్శనశాలలో జంతువులు, పక్షులను చూడటానికి అంతా పోటీ పడ్డారు. రెండు రోజుల్లో జంతు ప్రదర్శనశాలను సుమారు 30 వేలమంది సందర్శించారు. జూలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మినీ పార్కులో బాలబాలికలు ఆటపాటలతో సందడి చేశారు.

మహాబలిపురంలో...

సుప్రసిద్ధ పర్యాటక్రపాంతం మహాబలిపురంలోనూ సందర్శకుల తాకిడి పెరిగింది. అర్జున తపస్సు ప్రాంతం, పంచరథాలు, పులి గుహ, వెన్నముద్దరాయి ప్రాంతం, ప్రాచీన దీపస్తంభం, సముద్రతీర దేవాలయం తదితర ప్రాంతాలల్లో వేలాదిమంది పర్యాటకులు సందర్శించారు. కానుం పొంగల్ సందర్భంగా మహాబలిపురానికి చెన్నై, చెంగల్పట్టు, తాంబరం, తిరువాన్మియూరు నుండి ప్రత్యేక బస్సులను కూడా నడిపారు. మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి ఆలయానికి వెళ్లే భక్తులంతా మార్గమధ్యంలో మహాబలిపురంలో దిగి సముద్రస్నానాలు చేశారు. మహాబలిపురంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకుగాను వాహనాలను ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, బైపాస్‌రోడ్డులో పార్కింగ్ చేశారు. కానుంపొంగల్ సందర్భంగా మహాబలిపురం చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించేందుకు అనుమతిస్తారని భావించిన విదేశీ పర్యాటకులు, స్థానికులకు తీవ్ర నిరాశే మిగిలింది. విదేశాల నుండి వచ్చిన పర్యాటకులకు రూ.600, స్వదేశీ పర్యాటకులకు రూ.40 చొప్పు వసూలు చేశారు.

పళవేర్కాడులో...

తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సముద్రతీరం వద్ద కూడా గురువారం ఉదయం నుండే సందర్శకుల తాకిడి ఎక్కువైంది. పళవేర్కాడులోని డచ్ సిమెట్రీ నీడ గడియారం, ప్రాచీన శివాలయం, ఆదినారాయణ ఆలయం, మసీదు, పళవేర్కాడు సరస్సు, పక్షుల శరణాలయం తదితర ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు. కానుంపొంగల్‌ను పురస్కరించుకుని మహానగర రవాణా సంస్థ అధికారులు నగరం నలుమూలల నుండి పర్యాటక ప్రాంతాలకు 500 ప్రత్యేక బస్సులను కూడా నడిపారు.








వండలూరు ప్రవేశద్వారం వద్ద సందర్శకులు - గిండి చిల్డ్రన్ పార్కులో చెట్లెక్కిన బాలురు - వండలూరు జూలో కొండముచ్చులను తిలకిస్తున్న నగరవాసులు

అతివలకు కాదేదీ అసాధ్యం

● పురుషులకు దీటుగా రాతి గుండు ఎత్తిన మహిళలు









రాతి గుండు ఎత్తుతున్న యువకులు - మహిళలు

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా వడలివిలై ప్రాంతంలో పొంగల్ సందర్భంగా నిర్వహించిన రాతి గుండు ఎత్తే ఆటలో పురుషులకు దీటుగా మహిళలు చేయి కలిపారు. భారీ బండరాయి అవలీలగా ఎత్తిన మహిళలు తమ సత్తా చూపించారు. రాష్ట్రవ్యాప్తంగా పొంగల్ పండుగ వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. పండుగ సందర్భంగా గ్రామాలు కళా ప్రదర్శనలు, క్రీడా పోటీలు తదితరాలతో సందడిగా మారాయి. అలాగే, పండుగ సందర్భంగా సాహస క్రీడలు కూడా జరిగాయి. ఇలాంటి వాటిలో ఒకటైన రాతి గుండు ఎత్తే పోటీలు డెల్టా గ్రామాల్లో జరుగుతున్నాయి. తిరునల్వేలి జిల్లా వడలివిలై ప్రాంతంలో ఈ పోటీలు ఏర్పాటుచేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న యువకులు రాయి ఎత్తి మోకాళ్లపై ఉంచి, అనంతరం భుజాలపై వేసుకొని వెనుకను విసేరేశారు. మరికొందరు భుజంపై నుంచి ఒక చేత్తో రాయి ఎత్తి పడేశారు. అదే సమయంలో, పురుషులతో దీటుగా మహిళలు సైతం ధైర్యంగా రాళ్ల ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. కొందరు మహిళలు మరీ ధైర్యంగా భుజాల పైకి ఎత్తిన రాయి, మెడ చుట్టూ తిప్పుతూ సాహసాలు ప్రదర్శించారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న అనంతరం మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన పురుషులు, మహిళలకు బహుమతులు అందజేశారు.





సాహసకృత్యాల్లో సైనికులు

అబ్బురపరిచిన సైనిక విన్యాసాలు

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని వెల్లింగ్టన్ శిక్షణా కేంద్రంలో సైనికులు చేసిన సాహసకృత్యాలు అబ్బురపరిచాయి. బ్రిటీష్ సైనిక అధికారి సర్ ఫ్రాన్సిస్ బుట్చేర్ నుంచి భారత సైనిక అధికారి జనరల్ కేఎం కరియప్పాను జనవరి 15వ తేది బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జనవరి 15న భారత సైనిక దినోత్సవం జరుపుకుంటున్నారు. ఆ ప్రకారం, కున్నూర్ వెల్లింగ్టన్ ఎమ్మార్సీ సైనిక కేంద్రంలో బుధవారం 77వ సైనిక దినోత్సవం కమాండర్ క్రీస్తుదాస్ నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా సైనికులు పలు సాహసాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను విద్యార్థులు, అధికారులు వీక్షించారు. కార్యక్రమం అనంతరం సైనికులు, విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు.

అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభం

పెరంబూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మూడవ చెన్నై అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన నందంబాక్కంలోని వాణిజ్య కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. 2023 నుంచి నగరంలో అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మూడవ పుస్తక ప్రదర్శనను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ప్రారంభించారు. గురువారం నుంచి శనివారం వరకు జరిగే ఈ ప్రదర్శనలో అమెరికా, మలేసియా, ఫ్రాన్స్ సహా 65 దేశాలకు చెందిన ప్రచురణకర్తలు పాల్గొంటున్నారు. ఈ ప్రదర్శన జరిగే మూడు రోజుల్లో ప్రతిరోజు కొత్త పుస్తకాల ఆవిష్కరణ, సదస్సులు, చర్చాగోష్ఠి తదితరాలు నిర్వహించనున్నారు. కాగా, 2023లో తొలిసారిగా ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో 24 దేశాలు పాల్గొనగా, 2024 ప్రదర్శనలో 40 దేశాలు, ప్రస్తుతం 65 దేశాలు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అన్బిల్ మహేష్ మీడియాతో మాట్లాడుతూ... 66 తమిళ పుస్తకాలను 32 భాషల్లో అనువదించామని తెలిపారు. అలాగే, పెరియార్ వ్యాఖ్యలు 16 భాషల్లో అనువదించామన్నారు. తమిళం నుంచి ఇతర భాషాల్లో అనువదించిన 30 పుస్తకాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 18వ తేది ఈ అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో ఆవిష్కరించనున్నారని తెలిపారు. తమిళ పుస్తకాలను అంతర్జాతీయ స్థాయికి అనువదించేందుకు 35 మంది సాహిత్య నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.



ప్రదర్శనలో విదేశీ స్టాల్ పరిశీలిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

వినూత్న ఆవిష్కరణలపై దృష్టి సారించండి

● విద్యార్థులకు ఏఐసీటీఈ అధికారి ఎంఎస్ బాలా



అతిథులు, విద్యార్థులతో నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకంగా ఆలోచిస్తూ వినూత్న ఆవిష్కరణలపై దృష్టి సారించాలని విద్యార్థులకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఇన్వెస్టర్స్ కమిటీ డిప్యూటీ చైర్మెన్ ఎంఎస్ బాలా పిలుపునిచ్చారు. ఏఐసీటీఈ విద్యామంత్రిత్వ శాఖా ఇన్నోవేషన్ సెల్ (ఎంఐసీ) సహకారంతో సెయింట్ జోసఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నేతృత్వంలో జాతీయ స్టార్టప్ దినోత్సవంతో పాటు, ఉద్యమోత్సవ్-2025 వేడుకలను గురువారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తమిళ ప్రార్థనా గీతం, జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమైన ఈ వేడుకల్లో సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్డి శేషగిరిరావు స్వాగతోపన్యాసం చేస్తూ తమ కళాశాల చైర్మెన్ డాక్టర్ బాబు మనోహరన్ అందిస్తున్న ప్రోత్సాహంతో ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ప్రపంచ దేశాల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ముఖ్య అతిథి ఎంఎస్ బాలా మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి వినూత్న ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ప్రతిష్ఠాత్మమైన కార్యక్రమాన్ని నిర్వహించిన దేశంలోని పద్నాలుగు నోడల్ కేంద్రాల్లో సెయింట్ జోసెఫ్ కాలేజీ ఒకటి. దేశవ్యాప్తంగా 325కి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో స్టార్టప్లను ప్రదర్శించారు. ఏఐసీటీఈ నోడల్ సెంటర్ అధికారులు ఆనంద్ స్వరాజ్, నితిన్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్, సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థల చైర్మెన్ డా.బాబు మనోహరన్, డాక్టర్ అరుణ్‌కుమార్ సహా ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.